## క్లుప్తంగా

### చురుగ్గా గంగాలమ్మ గుడి నిర్మాణం



మూలపేటలోని నిర్మాణంలో ఉన్న గంగాలమ్మతల్లి గుడి

మునగపాక: మండలంలోని మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయం నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కై లాసపట్నంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. యండపల్లి, బి.కె.పల్లి, కె.తంగేడు, రాజుపేట, రామన్నపాలెం, రామచంద్రపురాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

యలమంచిలి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. యలమంచిలి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం రాంబిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెంలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అదేవిధంగా యలమంచిలి, ఎర్రవరం,కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 5 గంటల నుంచి 8గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

### కొనసాగిన వేసవి శిక్షణ



దిమిలి గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

రాంబిల్లి: మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కొనసాగుతోంది. విద్యార్థులతో శుక్రవారం నీతి కథలు చదివించారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల, రిసోర్స్ పర్సన్ నూకినాయుడు నీతి కథలను వివరించి ఆయా కథలలో నీతిని ఆచరించాలని విద్యార్థులకు సూచించారు.

### రోలుగుంటలో హనుమానోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారణ భక్తులు

రోలుగుంట: స్థానిక బండారు వీధిలో హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కొంతమంది స్వామివారి మాలలు ధరించారు. వీరంతా తొమ్మిది రోజుల పాటు దీక్షలు ఆచరించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అభిషేకాల కోసం భక్తులు తమ గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.



# ముంచెత్తిన వాన

### యలమంచిలిలో రహదారులు జలమయం



రాంబిల్లి సమీపంలో ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

యలమంచిలి రూరల్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులపైకి వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానిక రాజీవ్ క్రీడామైదానంలోకి భారీగా నీరు చేరడంతో చెరువును తలపించింది. ప్రస్తుతం వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నారు. భారీవర్షానికి మైదానమంతా నీరు చేరి బురదమయమైంది.దీంతో శిబిరాల నిర్వహణ కష్టమేనని శిక్షకులు,క్రీడాకారులు చెబుతున్నారు.రంగా వారి వీధి,ఎల్ఐసీ కూడలి,ప్రభుత్వ కాలేజీ కూడలి,బస్టాండు ప్రాంతం,రైల్వేస్టేషన్ రోడ్డు సహా పట్టణంలో పలు ప్రాంతాల్లో రహదారులపై నుంచి డ్రైనేజీల్లో నీరు పొంగి ప్రవహించింది. మరోవైపు 16వ నంబరు జాతీయ రహదారిపై వర్షం నీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. ఎర్రవరం అండర్‌పాస్ కిందకు భారీగా వర్షపు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయి, వాహనదారులు తీవ్రఅసౌకర్యానికి గురయ్యారు. అల్పపీడన ప్రభావంతో పలకరించిన వానతో ఒక్కసారిగా వాతావరణం కూల్‌గా మారింది. పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజానీకం కాస్త సేదతీరారు.ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో మేలుచేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



యలమంచిలి పట్టణంలోని ప్రభుత్వ కాలేజీ రహదారి పక్కన నిలిచిన నీరు



పెదఉప్పలం సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

### చిరు జల్లులతో ఉపశమనం

మునగపాక/రాంబిల్లి/ఎస్.రాయవరం/నక్కపల్లి: యలమంచిలి పట్టణంలో భారీ వర్షం కురవగా,మునగపాక, రాంబిల్లి, ఎస్.రాయవరం ,నక్కపల్లి మండలాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. ఉదయం భానుడు చంద్ర నిప్పులు కురిపించాడు. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గాలులు వీయడంతో పాటు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది.



దిమిలిలో ఈదురు గాలులకు ఊగుతున్న కొబ్బరి చెట్లు

ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామా ల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ సమీపంలో, సైతారుపేట జంక్షన్ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై, అడ్డురోడ్డు బిగ్‌బజార్ ,పెద ఉప్పలం వైఎస్సార్ విగ్రహం సమీపంలో రోడ్లపై నీరు నిలిచిపోయింది.

## యువతకు యూనియన్ బ్యాంకు రుణ ఆసరా

### 15 రోజుల్లో రూ.32.35 కోట్ల రుణాల మంజూరు

అనకాపల్లి: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకుల ద్వారా ఎడ్యుకేషన్ లోన్లు మంజూరు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శంకర్‌హోమ్‌రామ్ తెలిపారు.

స్థానిక రింగ్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పో–2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 23 యూనియన్ బ్యాంకు శాఖలు ఉన్నాయని, వాటి ద్వారా 15 రోజుల్లో హౌసింగ్, వెహికల్, ఎడ్యుకేషన్ లోన్ల రూపంలో రూ.32.35 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వాల ఆదేశాల మేరకు చిరువ్యాపారాల నుంచి పెద్దపెద్ద కంపెనీల ఏర్పాటు వరకు నిరుద్యోగ యువతీ, యవకులకు సబ్సిడీ లోన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, బ్యాంకుల చీఫ్ మేనేజర్లు దుర్గాప్రసాద్, మనీష్ కుమార్, పి.వి.ప్రసాద్, ఉద్యోగులు సత్యనారాయణ, చంద్రశేఖర్, ఖాతాదారులు పాల్గొన్నారు.



లోన్ ద్వారా తీసుకున్న కారుకు తాళం అందిస్తున్న యూనియన్ బ్యాంక్ డీజీఎం శంకర్‌హోమ్‌రామ్

## ప్రశాంతంగా ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పాయకరావుపేట: మండలంలో ఇంటర్మీడియెట్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కార్తికేయ జూనియర్ కళాశాలలోని కేంద్రాల్లో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 90 మంది గాను 50 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో రమేష్‌బాబు తెలిపారు.

**పరీక్ష కేంద్రం పరిశీలించిన డీఈవో**

అచ్యుతాపురం: స్థానిక ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని డీఈవో వెంకట లక్ష్మమ్మ శుక్రవారం సందర్శించారు. ఏఎంవో వెంకటేశ్వరరావు, కశింకోట ఎంఈవో చిట్టిబాబు, కశింకోట డీటీ పాల్గొన్నారు.

## బాణసంచా, సౌండ్ బాక్స్‌లు నిషేధం

మునగపాక: గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా బాణసంచా కాల్చరాదని, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయరాదని ఎస్ఐ పి.ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు, శుభకార్యక్రమాల నిర్వహణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రసాదరావు కోరారు.

మాకవరపాలెం: ఎన్నికల లెక్కింపు రోజున విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ రామకృష్ణారావు హెచ్చరించారు. ఈయన శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో 820 మందిని బైండోవర్ చేశామన్నారు. వీరంతా లెక్కింపు వరకు ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. లెక్కింపు రోజున బాణసంచా కాల్చొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా కాల్చితే కఠిన చర్యలు తప్పవన్నారు.

# ఆయుర్వేదం.. అద్భుత వైద్యం

ఆయుర్వేదం.. ప్రాచీన భారతీయ వైద్యం. సైడ్ ఎఫెక్ట్స్ తావులేని చికిత్సా విధానం. అందుకే నేటికీ ఆయుర్వేదంపై ప్రజలకు అంత నమ్మకం. కరోనా తర్వాత ఆ నమ్మకం పదింతలయింది. అందుకు కశింకోటలోని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణే నిదర్శనం. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆయుర్వేద వైద్య నిలయం ప్రస్తుతం మరింత ఆధునిక వసతులతో రోగులకు సేవలందిస్తోంది.



కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి



ఆస్పత్రి ఆవరణలో పెంచుతున్న ఆయుర్వేద ఔషధ మొక్కలు

- కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి ఆదరణ
- ప్రభుత్వ సహకారంతో పెరిగిన వసతులు
- షెడ్ ఏర్పాటైతే అందుబాటులోకి పంచకర్మ చికిత్స
- దాతల ఆర్థిక సాయం కోసం నిరీక్షణ

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రికి క్రమేపీ ఆదరణ పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఆస్పత్రిలో ఆధునిక సదుపాయలు కల్పించి వైద్య సేవలు మెరుగుపర్చారు. దుష్ప్రభావాలకు తావులేని చికిత్స కావడంతో ఆయుర్వేదిక్ వైద్య విధానం పట్ల ప్రజలు మక్కువ చూపుతున్నారు.

**వైద్యంలో వందేళ్ల చరిత్ర**

కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి సుమారు వందేళ్ల చరిత్ర ఉంది. శిథిల భవనంలో నడిచే ఆస్పత్రికి దశాబ్దం క్రితం మరో భవనం నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఆరు నెలల క్రితం అన్ని సదుపాయాలు కల్పించింది. ఆస్పత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. దాదాపు అన్ని వ్యాధులకు మందులు, ఆధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో స్థానికులతోపాటు నర్సీపట్నం, మాకవరపాలెం, హరిపాలెం తదితర దూర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

**అవగాహన పెరిగింది**

గతంలో స్థానికులు మాత్రమే అదికూడా అరకొరగా ఆస్పత్రి సేవలు వినియోగించుకునే వారు. గత కొన్ని మాసాలుగా ఆస్పత్రి వైద్యులు ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. విద్యా సంస్థలు, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ఆయుర్వేద వైద్యం, యోగా, ధ్యానం ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే ఆయుర్వేద ఔషధ మొక్కల పెంపకం చేపట్టారు. వాటిపై ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కలిగిస్తున్నారు.

దీంతో ప్రజల్లో మార్పు వచ్చింది. ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక షెడ్ ఏర్పాటుకు దాతల కోసం సిబ్బంది ఎదురు చూస్తున్నారు. త్వరలో పంచకర్మలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు.


**సదుపాయాలు పెరిగాయి**



గతంలో ఆయుర్వేద ఆస్పత్రికి అంత ఎక్కువ సంఖ్యలో రోగులు వచ్చేవారు కాదు. మేం కూడా ఎక్కువగా ఇంగ్లిష్ మందులే వాడేవాళ్లం. కరోనా సమయంలో ఆయుర్వేద మందులు బాగా పనిచేశాయి. దీనికితోడు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో సదుపాయాలు మెరుగుపర్చారు. చాలా వ్యాధులకు అవసరమైన మందులన్నీ ఆస్పత్రిలోనే ఉచితంగా ఇస్తున్నారు. దీంతో చాలా సమస్యలకు ఆయుర్వేద మందులే వేసుకుంటున్నాం. పక్క గ్రామాల నుంచీ రోగులు ఇప్పుడు వస్తున్నారు.

– కూండ్రపు అప్పియ్యనాయుడు, కన్నూరుపాలెం

**నమ్మకం పెరిగింది**



ఆయుర్వేదిక్ ఆస్పత్రికి స్థానికులతోపాటు సుదూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆయుర్వేద వైద్యంపై రోగుల్లో నమ్మకం పెరిగింది. తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. దీంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. రోజూ కనీసం 25 మందికి చికిత్స అందిస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన ఆధునిక పరికరాలు, వసతుల్ని ప్రభుత్వం కల్పించింది. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘ కాలిక వ్యాధులకూ వైద్యం అందిస్తున్నాం.

– డా.టి.శిరీష, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి, కన్నూరుపాలెం

## కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఆర్వో గీతాంజలి

నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పాయకరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి తెలిపారు. కౌంటింగ్‌లో విధులు నిర్వహించే వీఆర్వోలు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం ఆమె నక్కపల్లిలో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులను వివరించారు. పోలింగ్ మాదిరిగా లెక్కింపు కూడా ప్రశాంతంగా జరగాలన్నారు. ఈవీఎంల వద్ద, మీడియా సెల్ వద్ద ఎవరెవరు ఏ విధులు నిర్వహించాలనేది తెలియజేశారు. కౌంటింగ్‌ను ఏవిధంగా నిర్వహిస్తారు, ఈవీఎంల సీళ్లు తెరిచే విధానం, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, రౌండ్ల వారీగా లెక్కింపు కోసం టేబుళ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. లెక్కింపు సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో పలు జాగ్రత్తలను తెలియజేశారు. కౌంటింగ్ ఏజెంట్ల గుర్తింపు, రౌండ్లవారీగా ఫలితాలు వెల్లడి తదితర అంశాలతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫలితాలు వెలువడిన రోజున ఊరేగింపులు, బాణ సంచా కాల్చడం వంటి వాటిపై ఈసీ నిషేధం విధించినట్టు చెప్పారు. ముందుగా అభ్యర్థి సూచించిన వారిని మాత్రమే కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద ప్రత్యేక బారికేడ్లు, మెస్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కౌంటింగ్‌కోసం ఎంపిక చేసిన సిబ్బంది తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సిందేనన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ చైనులు, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జల గండం ..జర భద్రం

కోటవురట్ల: పిల్లలందరికీ నీరంటే భలే ఇష్టం.. వేసవి ఎండల నేపథ్యంలో నీటిలో ఆడడమంటే భలే సరదా.. సాధారణంగా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈత కొట్టేందుకు నీటి కుంటలు, చెరువుల వద్దకు వెళుతుంటారు. అయితే మండలంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ఈత సరదా వారి ప్రాణాలమీదకు తెచ్చే ప్రమాదం ఉంది. సరదాగా ఈతకు వెళ్లిన పలువురు ఏటా మృత్యువాత పడుతున్నారు. ఈత ఎంత ఉల్లాసాన్ని ఇస్తుందో జాగ్రత్తలు పాటించకపోతే అంత విషాదాన్ని నింపుతుంది.. మండలంలోని పలు ప్రాంతాల్లో నదులు, బావుల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో నదిలో స్నానాలకు వెళ్లిన పలువురు మృతిచెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలో వరాహనది పరీవాహక ప్రాంతంలోని యండపల్లి శివారున వంతెన సమీపంలోను, గవరపేట, ఇందేశమ్మవాక, గొట్టివాడ శివారు పైలట్ ప్రాజెక్టు ప్రాంతాల్లోని నదిలోని ఊబులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈత సరదాతో నదిలోకి దిగుతున్న పిల్లలు మృత్యువాత పడుతున్నారు. వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు నీటి వనరుల వద్దకు ఈతకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని పలువురు సూచిస్తున్నారు.



యండపల్లి శివారు వరాహనదిలో ప్రమాదకర ప్రదేశం

## యోగాతో ఆరోగ్యకర జీవనం

### ఘనంగా భారత స్వాభిమాన్ ట్రస్ట్ వార్షికోత్సవం

అనకాపల్లి: నిత్యం యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక యోగాసనాలు, స్విమ్మింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత యోగాపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఉదయం, సాయంత్రం సమయంలో యోగాసనాలు వేయడం ద్వారా చాలా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. దశల వారీగా పలు ప్రాంతాల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్‌లో శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాసనాలు నిర్వహించినట్లు తెలిపారు. 25న యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 26న జరిగే కార్యక్రమాలకు పతంజలి యోగపీఠ్, హరిద్వారకు చెందిన పూజ్యస్వామి రిత్ దేవ్ మహారాజ్ జీ, జొన్నలగడ్డ శ్రీనివాసులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ధ కాశీవిశ్వనాథ్, సభ్యులు వి.చంద్రశేఖర్, బీమశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కర్రి గంగాధర్, రోహిణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



జార్జిక్లబ్‌లో యోగాసనాలు వేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## ఉపాధ్యాయులకు సన్మానం

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని సర్పంచ్ పైల కోటేశ్వరరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రెసిడెన్షియల్ సీట్లను సాధించడంలో ప్రత్యేక బోధన అందించిన హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయుడు సూరిబాబులను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలో శుక్రవారం వీరిని గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు గొర్రుపోటు పైడంనాయుడు, రొంగలి నారాయణరావు, స్ఫూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 30న ఆలయ భూముల కౌలు వేలం

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మూడు దేవాలయాల భూములను మూడేళ్లపాటు పాటు కౌలు చేసుకోవడానికి ఈ నెల 30న వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2027 మే 31వ తేదీ వరకు వేలం దక్కించుకున్న కౌలు రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 176–5ఏలో 5.50 ఎకరాలు, 176–5ఏలో 1.50 ఎకరాలకు రూ. 10 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు ఆలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. మల్లికార్జునస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 37–16లో 3.42 ఎకరాలు, 37–17లో 4.44 ఎకరాలకు రూ. 2 వేల వంతున ధరావత్తు ముందుగా చెల్లించి ఆల యం వద్ద 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలం పా టలో పాల్గొనాలన్నారు. వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి విజయరామరాజుపేట రెవెన్యూలో సర్వే నంబర్ 4–21లో 2.63 ఎకరాలకు ధరావత్తు రూ.5 వేలు, సర్వే నంబర్ 4–25లో 50 సెంట్లకు రూ.2 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఆ రోజు వేలంలో పాట పాడినవారు మొదటి సంవత్సరం సొమ్ము అదే రోజు దేవస్థానానికి చెల్లించాలని ఈవో సూచించారు.